నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | RANGAREDDY

ప్రత్యేక పిల్లలకు అలవెన్స్‌లు విడుదల

బొంరాస్‌పేట, ఏప్రిల్ 8 : ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు(సీడబ్ల్యూఎస్ఎన్) ప్రతి నెలా అందాల్సిన వివిధ రకాల అలవెన్సులను ప్రభుత్వం విడుదల చేసింది. 2023 జూన్ నుంచి 2024 మార్చి వరకు వారికి సంబంధించిన అన్ని రకాల అలవెన్సులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. నిధులు నేరుగా పిల్లల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో అంధత్వం, దృష్టిలోపం, వినికిడి లోపం, అంగవైకల్యం వంటి 21 రకాల సమస్యలతో బాధపడుతున్న పిల్లలు 126 మంది ఉన్నారు. వారికి సేవలందించేందుకు ఐఈఆర్‌పీలు పనిచేస్తున్నారు. సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు భవి త కేంద్రాలు, ప్రతినెలా నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు వెళ్తుంటారు. వారికి అన్ని రకాల అలవెన్సులు కలిపి రూ.13.07 లక్షలను విడుదల చేసింది. 126 మంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు ప్రతినెలా రవాణా భత్యం కింద రూ.500 చొప్పున రూ.6.10 లక్షలు, వారిని భవిత కేంద్రాలకు తీసుకెళ్లే 55 మందికి ఎస్కార్ట్ అలవెన్సు కింద రూ.550 చొప్పున రూ. 3.02 లక్షలు, 191 బాలికలకు స్టైఫండ్ కింద రూ.200 చొప్పున రూ. 3.79 లక్షలు, 21 మంది బాలికలకు రీడింగ్ అలవెన్సు రూ.60 చొప్పున రూ.15,480 విడుదలయ్యాయి.

ధర.. దడ

సామాన్యులకు భారంగా మారుతున్న సన్న బియ్యం ధరలు

- క్వింటాలు బియ్యం ధర రూ.5,500 - రూ.6,200 వరకు విక్రయం
- పెరిగిన ధరలతో ప్రజలు విలవిల
- బ్లాక్ మార్కెట్‌తోనే ఈ దుస్థితి!
- యాసంగిలో తగ్గిన వరి సాగు విస్తీర్ణం
- రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం

రంగారెడ్డి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): సామాన్యులకు సన్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకూ వాటి ప్రైస్ పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు బియ్యం ధర రూ.5,500 నుంచి రూ.6,200 వరకు పలుకుతున్నది. యాసంగిలో వరి సాగు తగ్గడంతో రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింతగా ఉండనున్నది. దీంతో ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో ప్రజల్లో గుబులు మొదలైంది. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని బియ్యాన్ని బ్లాక్ చేస్తూ వ్యాపారులు పెద్ద ఎత్తున దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. బియ్యం ధరలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

పెరిగిన ధరలతో బెంబేలు..

ఇక్కడ పండించిన సన్నాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండడం, మిల్లర్లు, దళారులు నేరుగా రైతుల నుంచే వడ్లను కొని బియ్యంగా మార్చి స్టాక్ చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని బియ్యం వ్యాపారులు ఇష్టారీతిన ధరలు పెంచుతున్నారన్న విమర్శలున్నాయి. గతేడాది జనవరిలో కొత్త రకం బియ్యం క్వింటాలు ధర రూ. 3,200 నుంచి రూ.3,400 చొప్పున లభించగా.. 2023 అక్టోబర్ నుంచి క్వింటాలు ధర రూ.4,500 నుంచి రూ.5వేల చొప్పున విక్రయించారు. ఆ తర్వాత ధరలు ఒకేసారి అమాంతం రూ.1,300 నుంచి రూ.1,800 వరకు పెరిగాయి. పాత బియ్యం ధర రూ. 4,200 నుంచి రూ.4,500 వరకు పెరిగింది. ప్రస్తుతం బియ్యం ధరలు మరింతగా పెరిగి నాణ్యతను బట్టి రూ.5,500 నుంచి రూ.6,200 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితి నెలకొంది.

మల్టీ బ్రాండ్ పేరుతో మోసాలు

బియ్యం ధరల పెరుగుదలను కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఒకే రకమైన బియ్యాన్ని వివిధ బ్రాండ్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలో పలుచోట్ల టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, సివిల్ సప్లయ్ శాఖల అధికారులు జరిపిన తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగుజూసింది. కొన్ని చోట్ల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి పలు రకాల బియ్యాన్ని అందులో కలిపి సంచుల్లో నింపి పలు రకాల బ్రాండ్ల పేరిట ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. హోటళ్లు, రిటైల్ వ్యాపారులకు ఈ తరహా బియ్యాన్ని ఎక్కువగా అంటగడుతున్నట్లు తెలిసింది.

రానున్న రోజుల్లో మరింత పైపైకి..

రానున్న రోజుల్లో సన్న బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. రైతులు విక్రయించిన సన్నరకాల ధాన్యాన్ని మిల్లర్లు నిల్వ చేస్తున్నారు. సన్న బియ్యం స్టాక్ అంతా వ్యాపారుల గుప్పిట్లోనే ఉండడంతో ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. మరోపక్క ఈసారి యాసంగి సాగులో పంటల సాగు విస్తీర్ణం తగ్గడం కూడా ధాన్యం ధరల పెరుగుదలపై ప్రభావం చూపనున్నది. యాసంగిలో గతంలో ఎన్నడూ లేని గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. గతేడాది 1,23,240 ఎకరాల్లో రైతాంగం పంటలను సాగు చేయగా.. ప్రస్తుత యాసంగిలో గతంలో కంటే 20వేల ఎకరాల్లో తక్కువగా పంటల సాగు నమోదైంది. వరి విషయానికొస్తే.. గత యాసంగిలో వరి సాగు 90,447 ఎకరాలుంటే.. ప్రస్తుత యాసంగిలో 83,110 ఎకరాల్లో మాత్రమే సాగు అయింది. ఈ పరిస్థితుల కారణంగా వచ్చే రోజుల్లో బియ్యం ధరలు మరింతగా పెరుగనున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ విషయం సామాన్యులను మరింతగా కలవరపాటుకు గురిచేస్తున్నది. నిత్యావసరాలను రోజూ పర్యవేక్షిస్తూ ధరలు పెరిగినప్పుడు నియంత్రణకు సలహాలు ఇవ్వాల్సిన ఆహార సలహాల సంఘాలు సైతం పత్తాలేకుండా పోయాయి. దీనికితోడు అధికారులు ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాముల్లో తనిఖీలు చేపట్టకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా మార్కెట్‌ను శాసిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీతో ఒరిగిందేమీలేదు..

- పదేండ్ల పాలనలో పాలమూరు అభివృద్ధికి నిధులు కేటాయించలేదు
- మోదీ మూడోసారి ప్రధాని అయితే చంద్రమండలానికి రాజు అవుతారా..?
- గతంలో కేంద్రమంత్రిగా ఉన్న అరుణమ్మ ఏం సాధించారు..?
- కొడంగల్ కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 8 : పదేండ్ల మోదీ పాలనలో పాలమూరుకు ఏం లాభం చేకూరిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం సీఎం స్థానిక నివాసంలో పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్రమంత్రిగా ఉన్న డీకే అరుణ పాలమూరుకు ఎన్ని నిధులు తీసుకొచ్చారని...పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎందుకు జాతీయ హోదా తేలేదని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు ప్రధాని మోదీని మళ్లీ మూడోసారి ప్రధానిగా చేయాలని ప్రజలను కోరుతున్నారని, మూడోసారి పీఎం అయితే చంద్ర మండలానికి రాజు అవుతారా అని ఎద్దేవా చేశారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాభివృద్ధికి ఎలాంటి నిధులను మంజూరు చేయలేదని.. అలాంటి పార్టీని ఎందుకు గెలిపించాలన్నారు. 75 ఏండ్లుగా కొడంగల్ ప్రాంతం వెనుకంజలో ఉందని.. కాంగ్రెస్ పార్టీ వల్ల కొడంగల్ ఎమ్మెల్యేకు సీఎం పదవి దక్కి రాష్ట్రాన్ని శాసించే అధికారం వచ్చిందన్నారు. మా ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే నియోజకవర్గాభివృద్ధికి రూ. 5 వేల కోట్ల అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలకు పెద్ద ఎత్తున నిధులు, ప్రతి గ్రామానికీ సీసీ, బీటీ, డబుల్‌రోడ్ల వంటి ఎన్నో అభివృద్ధి పనులు మంజూరైనట్లు చెప్పారు. కొందరు ఓట్ల కోసం మతాలు, భాషాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొ డంగల్ సత్తాను మరోసారి చూపాలన్నారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహ ర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్, పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎండుతున్న పంట.. రైతన్న కంట కన్నీరు

ఇబ్రహీంపట్నం మండలంలోని తుర్కగూడ గ్రామానికి చెందిన రైతు మల్లారెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉన్నది. బోరుబావిలో నీరు సమృద్ధిగా ఉందని భావించి ఈ యాసంగిలో రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. అయితే భూగర్భ జలాలు అడుగంటడంతో ఉన్న బోరు వట్టిపోయి వేసిన పంట ఎండిపోతున్నది. పంటను కాపాడుకునేందుకు బోరు తవ్వించినా ఫలితం లేదు. ట్యాంకర్ ద్వారా పొలానికి నీటిని అందించాలనుకున్నా.. పెరిగిన ట్యాంకర్ల ధరను భరించలేక, మరింత అప్పుల భారం మోయలేక ఎండిపోతున్న పంటను కోసి పశువులకు దాణాగా వేస్తూ కన్నీరు మున్నీరవుతున్నాడు. -ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8

పశువుల మేత కోసం ఎండిపోతున్న వరిని కోస్తున్న రైతు మల్లారెడ్డి

ఉగాది శుభాకాంక్షలు

రంగారెడ్డి, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ) : జిల్లా ప్రజలకు మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, తెలుగు నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. షడ్రుల సమ్మేళనమే ఉగాది అని, జీవితంలో వచ్చే కష్టసుఖాలను అందరూ అనుభవించాలని గుర్తు చేసేదే ఉగాది పచ్చడి అని పేర్కొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా..

- కాంగ్రెస్ పాలనలో రాజ్యమేలుతున్న కరువు
- తప్పుడు హామీలతో గద్దెనెక్కి ప్రజలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి
- చేవెళ్ల బహిరంగ సభను విజయవంతం చేయాలి
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 8 : చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా అని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారని.. త్వరలో జరుగనున్న ఎన్నికల్లోనూ కాసాని జ్ఞానేశ్వర్ ఘన విజ యం సాధించడం ఖాయమన్నారు. సోమవారం తాండూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో కరువు రాజ్యమేలుతున్నదని.. తప్పుడు హామీలతో గద్దెనెక్కి ప్రజలను నట్టేట ముంచుతున్నదని మండిపడ్డారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో 209 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే తెలంగాణ సీఎం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపితే.. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్ రైతులు గోస పడేలా చేశారని ఆరోపించారు. చేవెళ్ల అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రస్తుతం బరిలో ఉన్న విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను గులాబీ సైనికులు గత ఎన్నికల్లో కష్టపడి గెలిపిస్తే మోసం చేసి పార్టీలు మారారని మండిపడ్డారు. నమ్మక ద్రోహం చేసిన వారికి రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని...కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్లలో 13వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ (కేసీఆర్) బహిరంగ సభను సక్సెస్ చేసేందుకు తాండూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజూగౌడ్, తాండూరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో ఉన్నత పదవులు అనుభవించిన నాయకులు నేడు పార్టీలు మారడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణమైన వారిని ఎప్పటికీ గెలవనివ్వమని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మోసం చేసిన ద్రోహులను చిత్తుగా ఓడిస్తామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు తాండూరు సెగ్మెంట్ నుంచి లక్షకుపైగా మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. 13న నిర్వహించనున్న చేవెళ్ల బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు నయీం, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, వీరేందర్‌రెడ్డి, నర్సింహులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం..

పోలీస్ భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

- పోలీస్ భద్రత మధ్య నియోజకవర్గాలకు చేరుకున్న ఈవీఎంలు
- ర్యాండమైజేషన్ అనంతరం ఆయా ప్రాంతాలకు కేటాయింపు
- ప్రతి పోలింగ్ కేంద్రానికీ 25 శాతం అదనంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు..
- 40 శాతం అదనంగా వీవీ ప్యాట్లు
- పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఈవీఎంల ఫైనల్ ర్యాండమైజేషన్ ప్రక్రియ
- ఇప్పటికే పూర్తయిన పీవో, ఏపీవో, ఓపీవోలకు శిక్షణ
- ఈ నెల 15 వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశం
- వికారాబాద్ జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 మంది

వికారాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలకు సరిపడా ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూం నుంచి పోలీస్ కాన్వాయ్‌తో ప్రత్యేక వాహనంలో తరలించారు. వికారాబాద్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని మేరీనాట్ స్కూల్‌లో, పరిగి సెగ్మెంట్ ఈవీఎంలను పరిగిలోని మినీస్టేడియంలో, తాండూరు సెగ్మెంట్ ఈవీఎంలను సెయింట్ మార్క్స్ స్కూల్‌లో, కొడంగల్ నియోజకవర్గ ఈవీఎంలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఈవీఎంల మొదటి దశ పరిశీలన ప్రక్రియ అనంతరం మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. మొదటి దశ ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియలో నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను కేటాయించగా, తుది దశ ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలను కేటాయించనున్నారు. ఈ ప్రక్రియను పోలింగ్‌కు మూడు రోజుల ముందు పూర్తి చేయనున్నారు. అయితే జిల్లాకు అదనంగా అవసరమైన 275 ఈవీఎంలను కొత్తగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఈసీఐఎల్ సంస్థ నుంచి జిల్లాకు తీసుకొచ్చారు.

ఎఫ్ఎల్‌సీ పూర్తి..

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో సిబ్బంది నియామకం, శిక్షణ, ఈవీఎంలను సిద్ధం చేసే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే ఓటరు తుది జాబితాతోపాటు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో పూర్తి కాగా.. రెండో దశ ఈవీఎంల పరిశీలన, ర్యాండమైజేషన్‌ను పూర్తి చేసి సోమవారం ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే మరో ఈవీఎంను ఏర్పాటు చేసేందుకు ప్రతి పోలింగ్ కేంద్రానికీ 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా వీవీ ప్యాట్లను సిద్ధం చేసి తరలించారు. పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలకు 381 కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, 427వీవీ ప్యాట్లను తరలించారు. వికారాబాద్‌లో 284 పోలింగ్ కేంద్రాలకు 355 సీయూలు, బీయూలు, 397 వీవీ ప్యాట్లు, తాండూరు నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాలకు 346 సీ యూలు, బీయూలు, 397 వీవీ ప్యాట్లు, కొడంగల్ నియోజకవర్గంలో 282 పోలింగ్ కేంద్రాలకు 352 సీయూలు, బీయూలు, 394 వీవీ ప్యాట్లను తరలించారు.

పీవో, ఏపీవోల వివరాలు ఎంట్రీ

మరోవైపు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవోల వివరాలను పొందుపర్చారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 5,028 మంది పీవో, ఏపీవో, ఓపీవోలకు శిక్షణ ఇచ్చారు. వీరిలో 1,257 మంది పీవోలు, 1,257 మంది ఏపీవోలు, 2514 మంది ఓపీవోలున్నారు. అలాగే అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికకు ఓటర్ల సంఖ్య పెరిగిన దృష్ట్యా పోలింగ్ కేంద్రాల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. తాండూరు నియోజకవర్గంలో 8, కొడంగల్ నియోజకవర్గంలో 7 పోలింగ్ కేంద్రాలు పెరుగనున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 1,133 పోలింగ్ కేంద్రాలున్నాయి. కేంద్రాల పెంపునకు ఈసీ ఆమోదం తెలిపితే వీటి సంఖ్య 1.148కి చేరనున్నది.

కొత్త ఓటరుగా నమోదుకు ఈ నెల 15 వరకు అవకాశం

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కొత్త ఓటరుగా యువత తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 15 వరకు గడువు ఇచ్చింది. మీసేవ లేదా ఆన్‌లైన్ ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్ తాండూరు నియోజకవర్గాల్లో మొత్తం 9,84,068 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 4,86,109 మంది, మహిళలు 4,97,920 మంది, ఇతరులు 39 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,66,273 మంది ఉండగా.. వారిలో పురుషులు 1,33, 625 మంది, మహిళలు 1,32,639 మంది, ఇతరులు 9 మంది.. వికారాబాద్ సెగ్మెంట్ లో మొత్తం ఓటర్లు 2,31,679 మంది ఉండగా.. వారిలో పురుషులు 1,15,019 మం ది, మహిళలు 1,16,647 మంది, ఇతరులు 13 మంది.. తాండూరు సెగ్మెంట్‌లో మొత్తం ఓటర్లు 2,43,849 మంది ఉండగా పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ఇతరులు ఏడుగురు.. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,267 మంది ఉండగా.. వారిలో పురుషులు 1,19,237 మంది, మహిళలు 1,23,020 మంది, ఇతరులు 10 మంది ఉన్నారు.

నామినేషన్ల దాఖలులో నిబంధనలు పాటించాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి బరిలో ఉండే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. నామినేషన్ ఫారం -2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి తీసుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెలవు రోజు, ఆదివారం మినహాయింపు ఉంటుందన్నారు. ఓ అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చని.. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్ర మే లోనికి అనుమతిస్తారన్నారు. జాతీయ, రాష్ట్ర పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుందన్నారు. అదే రిజిస్టర్డ్ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుందని సూచించారు. అభ్యర్థులు ఇటీవల దిగిన ఓ పాస్‌పోర్టు సైజు ఫొటోను అఫిడవిట్‌పై.. నామినేషన్ పత్రంపై స్టాంప్ సైజు ఫొటోను అతికించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంటు సెగ్మెంట్‌కు చెందితే తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వో నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని సూచించారు. రిజిస్టర్డ్, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్-3 లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేస్తూ వివరాలు పొందుపర్చాలన్నారు. అంతేకాకుండా అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ తెరవాలన్నారు. అభ్యర్థులు తమపై ఏవైనా క్రిమినల్ కేసులుంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-111ఏలో వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. అభ్యర్థుల సహాయార్థం ఆర్వో కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. దాఖలైన నామినేషన్లను ఈ నెల 26న పరిశీలన (స్క్రుట్నీ) జరుగుతుందని.. నామినేషన్ల ఉపసంహరణకు 29వ చివరి తేదీ అని తెలిపారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి..

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని కలెక్టర్ సూచించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు వంటివి ముద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, ప్రచారాంశాలు, ఎల్ఈడీ డిస్ప్లే కంటెంట్ తదితర వాటికి ఎంసీఎంసీ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీ నియోజ కవర్గ పరిధిలో నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, వాహనాల కోసం సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వో) నుంచి అనుమతి పొందాలని.. పార్లమెంటు నియోజకవర్గ పరిధి మొత్తంలో నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, ఎల్ఈడీ వాహనాలు, హెలిప్యాడ్, హెలికాప్టర్ వంటి వాటి అనుమతులను ఆర్వో కార్యాలయం నుంచి పొందాలన్నారు. కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో సంగీత, రాజేంద్రనగర్ ఏఆర్వో వెంకటరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.